www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 అక్టోబర్ 2023 | 5 | తూర్పుగోదావరి

నేడు చేదోడు లబ్ధిదారులకు నగదు జమ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జగనన్న చేదోడు పథకంలో ఈ నెల 19న 4వ విడత ఆర్థిక సహాయాన్ని జిల్లాలోని 13,476 మంది లబ్ధిదారులకు రూ.13.47 కోట్లను సిఎం జగన్ జమ చేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జరుగుతుందని, తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం ఈ కారక్రమాన్ని చేపడతారని కలెక్టర్ తెలిపారు. ఈ పథకం కింద జిల్లాలో దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నదని తెలిపారు. జిల్లాలో గత మూడు విడతలుగా 35,616 మంది లబ్ధిదారులకు రూ. 35.61 కోట్లు అందించారు.

దసరా.. దరువు..

- కూరగాయల ధరలు పైపైకి
- నాణ్యత పేరిట కిలోకి రూ.20పైనే పెంపు
- రైతు బజార్‌లో నాణ్యత లేని కూరగాయలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దసరా దరువు మొదలైంది. గత నెల రోజులుగా సామాన్యునికి అందుబాటులో ఉన్న కూరగాయలు మళ్లీ ఒక్కసారిగా కొండెక్కి కూర్చున్నాయి. రైతు బజారు ధరతో పోల్చితే బహిరంగ మార్కెట్లో కిలోకు సుమారు రూ. 20పైనే విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో దరువును చూసిన కొనుగోలుదారులు నోరెళ్లబెడుతున్నారు. బహిరంగ మార్కెట్లో నాణ్యత పేరుతో ధరలు ఎక్కువకు విక్రయిస్తుంటే రైతు బజార్లో నాణ్యత లేనివి ఉండటంతో ధర తక్కువకు విక్రయిస్తారని చెబుతున్నారు. వినియోగదారుల రద్దీని బట్టి కూరగాయల ధరలు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రానికి వేర్వేరుగా పెరుగుతున్నాయి. దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో సుమారు 10 రోజులపాటు చాలా మంది మాంసాహారానికి దూరంగా ఉండటం పరిపాటి. మరో పక్క భవానీ దీక్షలు ఆచరించే భక్తుల సంఖ్య పెరిగింది. దీంతో కూరగాయల వినియోగం భారీగా పెరిగింది. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయాలు సాగిస్తున్నారు. దసరా ఉత్సవాలు ముగిసే వరకూ కూరగాయల రేట్లు దిగొచ్చే పరిస్థితి లేనేలేదని వ్యాపారులు తెగేసి చెప్పడం విశేషం.

ఒక్కోచోట.. ఒక్కో ధర..

బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు ఒక్కోచోట ఒక్కోలా ఉంటున్నాయి. ప్రస్తుతం దొమ్మేరు రకం వంకాయలు కిలో రూ.60వ వరకూ విక్రయిస్తున్నారు. బీరకాయలు రూ.50, ఉమాటా రూ.40, బెండకాయలు రూ.40, దొండకాయలు రూ.40, పచ్చిమిర్చి రూ.60, బంగాళాదుంపలు రూ.50, క్యారట్ రూ.60, క్యాప్సికం రూ.120, బీట్‌రూట్ రూ.60, చిక్కుళ్లు రూ.120 పలుకుతున్నాయి. రైతు బజార్లో అయితే ధరలు సగానికి సగం ఉన్నాయి. బీరకాయలు కిలో రూ.24, బెండకాయలు రూ. 30, బంగాళాదుంపలు రూ. 29, వంకాయలు రూ. 30 టమాటా రూ. 24 చొప్పున ఉన్నాయి. ఇక చిక్కుళ్లు రూ. 100, ఆగాకర రూ. 90, బీట్‌రూట్ రూ. 40, క్యారట్ రూ. 40, అరటికాయలు 3 రూ.20, ఆకు కూరలు అయితే రెండు కట్టలు రూ.10లు ఉన్నాయి. అదే బహిరంగ మార్కెట్ లో అయితే ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఒక్కో రకంపై కిలో రూ.20 నుంచి రూ.30ల పైనే వేసుకుని విక్రయిస్తున్నారు. రైతు బజార్లో విక్రయించే కూరగాయల్లో అంతగా నాణ్యత లేకపోవడంతో బహిరంగ మార్కెట్లో కూరగాయలనే ఆశ్రయిస్తున్నారు. సాధారణ రోజుల్లో అయితే కిలో రూ. 10లు మాత్రమే తేడా ఉంటుంది. ప్రస్తుతం దసరా కావడంతో ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ఉదాహరణకు ఏదైనా కూరగాయల ధర కిలో రూ.90లు చెబితే అర కిలో రూ.50లకు, పావు కిలో రూ.30లు చొప్పున విక్రయాలు చేస్తున్నారు.

కొండెక్కిన కొత్తిమీర

ఇక కొత్తిమీర ధర కొండెక్కి కూర్చుంది. వ్యాపారులు కొత్తిమీరను పెద్దపెద్ద కట్టలు కట్టి లెక్కన విక్రయాలు చేసే వారిని పెద్ద, చిన్న కట్టలుగా కట్టి మార్కెట్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం 130 కట్టలు రూ.3,600 నుంచి రూ.3,800ల వరకూ ధర ఉందని వ్యాపారులు చెబుతున్నారు. రెండు రోజుల కిందట ఈ ధర మరింత ఎక్కువగా ఉండేదని, ఇప్పుడు కాస్త తగ్గిందని అంటున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరంతో పాటు ఇతర అన్ని మార్కెట్లు, రైతుబజార్లలో బెంగుళూరు కొత్తిమీర మాత్రమే అందుబాటులో ఉంది. వాస్తవానికి జిల్లాలోని తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామ పరిసరాలు కొత్తిమీర, ఆకుకూరల సాగు అధికంగా జరుగుతోంది. అక్కడ పంట చేతికి రావాలంటే మరో నెలరోజులైనా పడుతుందని చెబుతున్నారు. చుక్కకూర, మెంతికూర పెద్దగా మార్కెట్లోకి రావడం లేదు. తోటకూర, పొన్నగంటి కూర, బచ్చలికూర, గోంగూర మాత్రమే లభిస్తున్నాయి. ఇలా ధరలు భారీగా పెరగడంతో ఏం తిని బతకాలంటూ ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జెసి తేజ్ భరత్, ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

-జెకెసి అర్జీల స్వీకరణలో జెసి

ప్రజాశక్తి - నిడదవోలు

ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వం లక్ష్యంగా ముందుకు సాగుతుందని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. బుధవారం స్థానిక కొత్తపల్లి శ్రీ రాములు కనకమ్మ లయిన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన మండలస్థాయి జెకెసి కార్యక్రమంలో జెసితోపాటు, ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు, సహాయ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్, డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎస్. మల్లిబాబు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ పంచాయితీ, వైద్య ఆరోగ్య, మున్సిపల్ అడ్మిన్ట్రేషన్, రెవెన్యూ, భూ సంబంధ, హౌసింగ్, తదితర శాఖల కు చెందిన మండల స్థాయి స్పందనలో 152 అర్జీలను స్వీకరించామని తెలిపారు ఇందులో నిడదవోలు రూరల్ పరిధిలోనికి 70 కాగా, అర్బన్ పరిధిలోనికి 82 అర్జీలు ఉన్నాయన్నారు. ప్రతి బుధవారం మండల స్థాయిలో జెకెసి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క అర్హత కలిగిన అర్జీలను వారం రోజుల లోగా పరిష్కారం చూపడం జరుగుతుందని అన్నారు. ఆమేరకు ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పని చేయాలనే లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ జిల్లా అధికారులు పి.జగదంబ, ఎస్‌జిటి సత్య గోవింద్, ఎ.ముఖ లింగం, ఎన్‌వి. సత్యనారాయణ, కె. విజయ కుమారి, జి.పరశురామ్, జిల్లా, మండల, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం...

మహతి విద్యా సంస్థలో తరగతులు జరుగుతున్న దృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

ప్రభుత్వ నిబంధనలు తమకు వర్తించవనే రీతిలో కొన్ని ప్రయివేటు విద్యా సంస్థల యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. వాస్తవంగా దసరా సందర్భంగా ప్రభుత్వం ఈ నెల 14 నుంచి 24 వరకూ విద్యా సంస్థలకు శెలవులను ప్రకటించింది. అయితే ప్రభుత్వం ఏమి చెప్పినా అంతా మా ఇష్టం అన్నట్లుగా మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన శ్రీ మహతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోంది. ప్రత్యేక తరగతుల పేరుతో శెలవులు ప్రకటించిన నాటి నుంచి నేటి వరకూ తరగతులను నిర్వహిస్తూనే ఉంది. దీనిపై విద్యార్థుల తల్లీదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంఇఒ స్వామినాయక్‌ను వివరణ కోరగా తరగతులను నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని, ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఇదే అంశంపై పాఠశాల యాజమాన్యం ప్రతినిధి మహతిని వివరణ కోరగాఉన్నతాధికారుల నుంచే అనుమతి తీసుకునే క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇంటింటికీ 'బాబుతో నేను' కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - గోకవరం, ఉండ్రాజవరం

మండలంలోని వెదురుపాక, తంటికొండ, కొత్తపల్లి గ్రామాల్లో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికీ బాబుతో నేను కారక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. వైసిపి పాలనలో అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే చంద్రబాబుపై అక్రమంగా కేసులు పెట్టి జైలు పాలు చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఉంగరాల రాము, అడపా భరత్ బాబు, కన్నబాబు, పార్టీ కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. ఉండ్రాజవరం మండలంలోని వెలగదుర్రులో టిడిపి ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామంలో రచ్చబండ నిర్వహించి, ప్రజల సంఘీభావం కొరకు ఇంటింటికి నాయకులు తిరిగి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.రామకృష్ణ, ఆర్.శ్రీనివాసు, ఎం.రవీంద్ర రాజు, వి.కృష్ణ, పాతూరి నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో కరపత్రాలను పంపిణీచేస్తున్న టిడిపి నాయకులు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి కెవికె.దుర్గారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిడిఒ రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి జరిగే సమావేశానికి అధికారులు ప్రతి ఒక్కరు తగిన సమాచారంతో హాజరు కావాలని సూచించారు. తహశీల్దార్ ఎం.రామకృష్ణ, జడ్‌పిటిసి పొట్టి స్వర్ణలత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

రాజేశ్వరి తండ్రిని అభినందిస్తున్న ఎల్ఐసి అధికారులు

మిలియన్ డాలర్ సమావేశానికి రాజేశ్వరి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ముక్కామల గ్రామానికి చెందిన సలాది శ్రీ రాజేశ్వరి 2024 ఆర్థిక సంవత్సరానికి అమెరికాలో జరిగే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశానికి అర్హత సాధించారు. ఎల్ఐసి తణుకు బ్రాంచ్‌లో ఏజెంట్‌గా పనిచేస్తున్న ఆమెను బుధవారం రాజమహేంద్రవరం ఎల్ఐసి డివిజన్ స్థాయి సమావేశంలో ఎల్ఐసి ఉన్నతాధికారులు అభినందించారు. అలాగే ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, రవళి స్పిన్నర్స్ జెఎండి డైరెక్టర్స్ వంక రాజకుమారి, రఘువీర్ రవళి, జె.సుందర్ రాజన్, డివిజనల్ మేనేజర్ ప్రసాదరావు, బి.శ్రీనివాస్, ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ కేతా త్రిమూర్తులు అభినందించారు.

ధాన్యం సేకరణపై సమీక్ష

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి, ఉపాధి ఎపిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణపై సమన్వయ సమావేశం బుధవారం నిర్వహించారు. మండలంలో పిఎసిఎస్‌లు, మిల్లర్స్, ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐ, ఎంఎస్ఓ, ఎఎస్‌ఓలతో ధాన్యం సేకరణపై శ్రీనివాస్ పలు సూచనలు చేశారు. రైస్ మిల్లులకు రైతులకు అవసరమైన గోను సంచులు అందచేయాలని ఆదేశించారు.

దోపిడీ రహిత సమాజం కోసం పాటుపడదాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పార్టీ కార్యకర్తలు రాజకీయ సైద్ధాంతిగా అవగాహనతో ఉండాలని దోపిడీ రహిత సమాజం కోసం పాటుపడాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో కమ్యూనిస్టు పార్టీ పని విధానం అనే అంశంపై బుధవారం జరిగిన వర్క్ షాప్ లో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎక్కడైతే ఉన్నారో అక్కడికి పార్టీ శ్రేణులు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాడాలని అన్నారు. దేశంలో బూర్జువా పార్టీలు అధికారం కోసం అనేక అడ్డదారులు తొక్కుతున్నాయన్నారు. అధికారాన్ని నిలబెట్టుకోవడం కోసం మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు వెనకాడటం లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు రాజకీయ స్పష్టత లేదని, మూడు పార్టీలు నరేంద్ర మోడీకి గులాంగిరి చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ వనరులను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్మకాలు సాగిస్తున్నా నోరు మెదపని స్థితిలో ఆ పార్టీలు ఉన్నాయన్నారు. ప్రజల్లో ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చి ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చిట్టూరి ప్రభాకర్ చౌదరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు తాటిపాక మధు అధ్యక్షతన ఈ వర్కషాప్ జరిగింది. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కోండ్రపు రాంబాబు, వి.కొండలరావు, సప్ప రమణ, పి రాము, సేలం వెంకటేష్, శారద ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వర్క్ షాపులో మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

వచ్చే ఎన్నికల్లో బిఎస్‌పిని గెలిపించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ(బిఎస్‌పి)ని గెలిపించుకుని, రాష్ట్ర అసెంబ్లీలో అడుగుపెట్టేలా కృషి చేయాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి అన్నారు. బుధవారం మండల కేంద్రం ఉండ్రాజవరంలో నిర్వహించిన బహుజన చైతన్య సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజల సమస్యలను పక్కనపెట్టి, అధికారాన్ని పంచుకునేందుకు పోటీ పడుతున్నాయని విమర్శించారు. ఒకరు జైలు నుంచి వచ్చి సిఎంగా నవరత్నాల పేరుతో ప్రజలను మోసం చేస్తుంటే, మాజీ సీఎం నేడు జైలులో ఉన్నారని అన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చే పార్టీలను నమ్మి బహుజనుల జీవితాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యారన్నారు. ఎస్‌సి సంక్షేమ పథకాలన్నింటినీ పక్కదోవ పట్టించి, నవరత్నాలకు వాడుకుంటున్నారన్నారు. గతంలో పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి స్కాలర్షిప్ వచ్చేదని, నేడు అమ్మఒడి పేరుతో కుటుంబంలో ఒక్క విద్యార్థికి పరిమితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు మర్రి మహాలక్ష్ముడు, డొల్ల జాషువా, ఎం బాలయ్య, గడ్డం సంపద రావు, మాగాపు చిత్రసేన్, పోలా బత్తుల సత్యం, నేతల రమేష్ బాబు, పాట్నాల విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మేము సైతం బాబు కోసం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మేము సైతం బాబు కోసం కార్యక్రమం ధవళేశ్వరం గ్రామంలో క్లస్టర్ 5 ఇన్‌ఛార్జ్ పండూరి .అప్పారావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ నీలు.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. రూరల్ మండల టిడిపి అధ్యక్షులు మత్సెటి శివసత్య ప్రసాద్, 130వ బూత్ కన్వీనర్ నందిగం.సత్యనారాయణ స్థానిక నాయకులతో ఇంటి ఇంటికి వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్ట్ కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పల్లా.రామస్వామి యాదవ్, ఇళ్ల.రాంబాబు, ముచి.నాని, కర్రి.సత్యనారాయణ, గుబ్బల.దశరద్, నాళ్ళ.రమేష్, సింహాద్రి, బొబ్బిలి.రామకృష్ణ, కింతాడి .శివ శంకర్, బొబ్బిలి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

21న గోకవరం మండల సమావేశం

ప్రజాశకి - గోకవరం

గోకవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ కె.పద్మజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి సుంకర శ్రీవల్లి అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశంలో ఎంపి వంగా గీత, ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొంటారని, ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసినట్లు మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి మైత్రి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాధాకష్ణ మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో 15 ఆర్బికే కేంద్రాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులను నియమించినట్లు తెలిపారు. ఆర్‌బికెలలో మోచ్యురైజర్ మిషన్, కంప్యూటర్, ప్రింటర్, తదితర పరికరాలు లేనిపక్షంలో సమకూర్చుకోవాలని 100 శాతం గన్ని బేగ్స్‌ను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కెవికె.దుర్గారావు, ఎం.రాజేంద్రబాబు, తహశీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపిడిఒ రామకష్ణంరాజు, సొసైటీ ఛైర్మన్ కవల శ్రీను, సివిల్ సప్లై అధికారులు, విఎ ఎలు, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వడ్లూరులో గడప గడపకూ ప్రభుత్వం..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వడ్లూరు లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ జి. శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలను సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, గ్రామ సర్పంచ్ రఘు మండ తేజశ్రీ, వైసిపి నాయకులు కఠారి సిద్ధార్థ రాజు, పాలాటి శరత్, వాలంటీర్లు పాల్గొన్నారు.

అందరూ విధిగా హాజరు కావాలి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రు గ్రామ సచివాలయం వద్ద గురువారం జరిగే చేదోడు పథకం కార్యక్రమానికి అందరూ విధిగా హాజరుకావాలని ఎంపిపి కె.సీతారాం ప్రసాద్, ఎంపిడిఒ డి.దామోదరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు రానున్నారని, గురువాంర ఉదయం 11 గంటలకు సిఎం జగన్ ఈ కార్య్రమాన్ని తాడేపల్లి నుంచి ప్రారంభిస్తారని చెప్పారు. కావున మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఆయా గ్రామాల. లబ్దిదారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొనాలని కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - దేవరపల్లి

గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి గ్రామ కమిటీల కీలక పాత్ర పోషించాలని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు పిలుపునిచ్చారు. దేవరపల్లి మండల స్థాయి నూతన కమిటీ సమావేశం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి గ్రామ మండల కమిటీలు కృషి చేయాలని అన్నారు. జనసేన, టిడిపి గ్రామ, మండల కమిటీలు సమన్వయం చేసుకుంటూ సైకో పరిపాలనకు చరమగీతం పాడడానికి కంకణబద్ధులై పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కె. గణేష్, ఎ.గంగరాజు, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

సాంకేతిక బృందం సాక్షిగా...

జగనన్న లే అవుట్ తవ్వకాల్లో రాళ్లు ప్రత్యక్షం

తవ్వకంలో బయటపడుతున్న రాళ్లు

ప్రజాశక్తి - గోపాలపురం

గృహ నిర్మాణాలకు అనుకూలంగా లేని స్థలంలో జగనన్న లే అవుట్ ఏర్పాటు చేయడంపై లబ్ధిదారుల వ్యతిరేకత నేపథ్యంలో భూగర్భ శాఖ సాంకేతిక బృందం బుధవారం పరిశీలించింది. గోపాలపురం శివారులోని మెట్ట ప్రాంతమైన సర్వే నెంబర్ 126-1ఎంలో 5.50 ఎకరాలను జగనన్న కాలనీని నిర్మించేందుకు ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసింది. ఈ కాలనీలో 189 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి 2020 డిసెంబర్ నెలలో పట్టాలు ఇచ్చారు. లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినా వారిలో సంతోషం కన్పించలేదు. ఎందుకంటే ఆ ప్రాంతం గృహ నిర్మాణానికి ఏమాత్రం అనుకూలంగా లేకపోవడమే. దీనికితోడు గ్రామానికి దూరంగా ఈ లే అవుట్‌ను వేయడం మరో కారణంగా నిలిచింది. కొందరు గృహ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించినా ఆ ప్రాంతంలో బండరాయిలు తగలడంతో లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికారులతోపాటు, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోనూ పలు ఫిర్యాదులు చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదులపై జాయింట్ కలెక్టర్, ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, ఆర్‌డిఒ, ఇతర అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈ నేపథ్యంలోనే ఉన్నతాధికారుల ఆదేశాలతో గోపాలపురం తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ సూచన మేరకు భూగర్భ శాఖ కార్యాలయ సాంకేతిక సిబ్బంది బుధవారం లేఅవుట్ల స్థలాల్లో జెసిబి మిషన్ ద్వారా తవ్వకాలు చేశారు. ఎక్కడ తవ్వినా రాళ్లు ప్రత్యక్షం కావడంతో తవ్వకాలు చేయడం కష్టంగా మారింది. కొద్దిపాటి తవ్వకంలో బయటపడ్డా రాళ్లను పరీక్షించేందుకు సాంకేతిక బృందం సేకరించింది. రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించారు. సంబంధిత నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ జియాలజిస్ట్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డిటి.కృష్ణ, సొసైటీ అధ్యక్షులు కె.రామ్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు ఎస్‌కె ఖాదర్ వలీ, ఎం.శ్యామ్ సుందర్ రెడ్డి, ఎం. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

జెఎఎస్ శిబిరాల్లో వైద్య సేవలు



చాగల్లులో రోగులతో మాట్లాడుతున్న మంత్రి వనిత

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్) శిబిరాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. బుధవారం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో జెఎఎస్ శిబిరాలు జరిగాయి. **ఉండ్రాజవరం** మండలంలోని కె.సావరంలో నిర్వహించిన జెఎఎస్ శిబిరంలో 480 మంది వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.రామకృష్ణ, నాయకులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, బి.శ్రీనివాస్, ఎస్.రామకష్ణ, కె.పాండు రంగారావు, ఎంపిడిఒ జివిఎస్‌ఆర్‌కె.రాజు, ఇఒపిఆర్‌డి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎండి హసన్ జానీ,తదితరులు పాల్గొన్నారు. అలాగే వెలగదుర్రు గ్రామంలో జెఎఎస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి సిహెచ్ఓ ఎం.సుబ్రహ్మణ్యం గ్రామాల్లో వివిధ రోగాలతో ఉన్న వారిని గుర్తించి ఆయా శిబిరాలకు తరలించి వైద్య సేవలను అందించాలని సూచించారు. **రాజమహేంద్రవరం రూరల్** మండలంలోని శాటిలైట్ సిటిలో జెఎఎస్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రూరల్ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమం మాజీ కార్పొరేటర్ పాలిక శ్రీను, వైసిపి నాయకులు, సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక సచివాలయం -4 పరిధిలో జెఎఎస్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి తానేటి వనిత పాల్గొన్నారు. అనంతరం రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయం భవనాన్ని ఆమె ప్రారంభించారు. సచివాలయం-3 లో గడపగడప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి ఉపాధ్యక్షురాలు పి.శ్రీలక్ష్మి, ఎంపిపి మట్ట వీరస్వామి. సర్పంచ్ వి. మనశ్శాంతి, ఎంపిటిసి సభ్యురాలు వి.విజయ కుమారి, మండల అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక సచివాలయం-3లో సర్పంచ్ కె. శ్రావణి ఆధ్వర్యంలో జెఎఎస్ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సుమారు 457 మందికి వైద్య సేవలు అందించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్‌ను వైసిపి నాయకులు డి.రమేష్, ఎస్.వీరబాబు సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు టి.రాంప్రసాద్, ఎన్.నరసయ్య, షేక్ మేరాబి, సిహెచ్.అనిల్ కుమార్, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడి, ఆశ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పెరవలి** మండలం కానూరు అగ్రహారంలో జెఎఎస్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిపి కె.సీతారాం ప్రసాద్ ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ ఎఎస్ కృష్ణవేణి, డాక్టర్ ఎన్.జాన్‌మిల్టన్ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసం వెంకన్న, పిహెచ్‌సి సూపర్‌వైజర్ జి.సత్యేంద్ర కుమార్, కెవి.నాగేశ్వరరావు, రాజా సులోచన, విజయలక్ష్మి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో రోగిని పరీక్షిస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

9 మందికి ఒకరోజు జైలు శిక్ష

ప్రజాశక్తి-తాళ్లరేవు

పి.మల్లవరం గ్రామపంచాయతీ పత్తిగొంది గ్రామానికి చెందిన 9 మందికి కాకినాడ ఒకటవ స్పెషల్ జ్యూడిషయల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హెచ్. వీరభద్రుడు ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు కోరంగి ఎస్ ఐ. శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గ్రామానికి చెందిన నక్క నాగరాజు, నక్క దుర్గాప్రసాద్, ఎలిపే అన్నవరం, వడ్డి వరప్రసాద్, దడాల మావుళ్ళ కుమార్, పత్తి పృథ్వి సందీప్, దడాల నవీన్ కుమార్, దున్న పృథ్వి ప్రశాంత్, నక్క రాంబాబులపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోరంగి ఎస్ఐ. శ్రీనివాస కుమార్ ఈనెల 15వ తేదీన కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి 24 గంటలు జైలు శిక్ష విధిస్తూ బుధవారం జడ్జ్ తీర్పు చెప్పారని తెలిపారు. శిక్ష పడిన 9 మంది ముద్దాయిలను పోలీసులు కాకినాడ సబ్ జైలుకు తరలించారు.

తుని పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణ సంచా

బాణసంచా స్వాధీనం

ప్రజాశక్తి-కోటనందూరు

తుని పట్టణం రెల్లి పేటలో అక్రమంగా బాణసంచా సామాగ్రిని నిల్వ ఉంచిన వ్యక్తిని అరెస్ట్ చేయడం జరిగిందని తుని టౌన్ సిఐ ఎం. గీత రామకృష్ణ తెలిపారు. స్థానికులు ఇచ్చిన ముందస్తు సమాచారంతో రెల్లి పేటలో ఒక ఇంటిని పోలీసులు తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ చేసిన బాణాసంచా సామాగ్రిని గుర్తించినట్లు తెలిపారు. ఇంటి యజమాని వాకపల్లి సూర్యనారాయణ తుని పట్టణంలో ఫ్యాన్సీ వ్యాపారం చేసుకుంటూ రాబోయే దీపావళి బాణసంచాను అమ్మడం కోసం నిల్వ వంచినట్లుగా గుర్తించారు. దీని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. తుని పట్టణంలో పోలీసులు అనుమతులు లేకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించకుండా బాణసంచా సామాగ్రిని తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దొరికిన సామాగ్రిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది జి. దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రాజపూడిలో బాలిక అదృశ్యమైనట్లు జగ్గంపేట ఎస్ఐ నాగార్జున రాజు బుధవారం తెలిపారు. జగ్గంపేట మండలం రాజుపూడి గ్రామానికి చెందిన రాజపూడి గ్రామంలో 9వ తరగతి వరకు చదివిన ఆ బాలిక(17) ఇటీవల కాలంలో చదువు మానేసి ఇంటి వద్ద టైలరింగ్ తర్వాత చదువు మానేసి ఇంటి వద్దనే ఉంటూ గ్రామంలో టైలరింగ్ నేర్చుకుంటుంది. ఈ నెల 16న కూడా టైలరింగ్ నేర్చుకోవడానికి వెళ్లి తిరిగి ఇంటికి రానట్లు తెలిపారు. దీనిపై ఆమె తండ్రి అడ్డాల మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జెడ్‌పిటిసిపై దాడి : కేసు నమోదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రామచంద్రాపురం జడ్‌పిటిసి సభ్యుడు మెర్నీడి వెంకటేశ్వరరావుపై దాడి చేసి, దుర్భాషలాడిన దామిశెట్టి గంగాపురుషోత్తం అతని కుమారుడు దామిశెట్టి సత్యనారాయణ మూర్తిలపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారం ఎస్ఐ బి.వినోద్ తెలిపారు. నిందితులపై 324 పై 506, 365 సెక్షన్ కింద కేసులు నమోదు చేశామని ఆయన వివరించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ తరచూ భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రం ఆత్రేయపురం చిన్న పేటకు చెందిన బూల సౌందర్యకి కొత్తపేట మండలం వాడపాలెం గ్రామానికి చెందిన బూల రామకృష్ణతో 2016లో వివాహం అయ్యింది. వీరి కాపురం కొన్నాళ్లు సజావుగానే సాగింది. వీరికి అబ్బాయి, అమ్మాయి ఉన్నారు. ఇటీవల కాలంలో అదనపు కట్నం తేవాలంటూ భర్త నుంచి మానసికంగా, శారీరకంగా వేధింపులు ఎక్కువ అవడంతో సౌందర్య విచికి వేచారి సహనం కోల్పోయి బుధవారం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగనోట్ల ముఠా

ప్రజాశక్తి - మండపేట

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఐదుగురుతో కూడిన దొంగనోట్ల ముఠాను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.500 నోట్లు 62, రూ.200 నోట్లు 21తోపాటు కంప్యూటర్, కలర్ ఫొటో ప్రింటర్, ల్యాప్ ట్యాప్ తదితర వాటిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సిఐ కె.శ్రీధర్ కుమార్ తెలిపారు. మండలంలోని తాపేశ్వరం, అర్తమూరు గ్రామాలకు చెందిన వీరవెల్లి రామకృష్ణ, పిల్లా అచ్చారావు, బుడపనేటి శ్రీనివాసు, వెలగల రామారెడ్డి, పడాల మణికంఠ ఆదిరెడ్డిలు తాపేశ్వరంలోని వాసు ఫొటో స్టూడియోలో దొంగనోట్లు ప్రింటింగ్ చేసి స్థానిక రాజారత్న సెంటర్‌లో దొంగనోట్లు మారుస్తుండగా ఎస్ఐ అశోక్ తన సిబ్బందితో వెళ్లి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి దొంగ నోట్లతోపాటు తయారీ పరికరాలను స్వాధీనం చేసుకుని ఆలమూరు జెఎఫ్ సి ఎమ్ కోర్టు లో హాజరు పరిచగా కోర్టు వీరికి 14 రోజులు రిమాండ్ విధించిందని అన్నారు

యానాం వార్తలు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కనకాల రాజు

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని కాకివారి వీధిలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలోకాకి నాగేశ్వరరావుకు చెందిన ఇల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బట్టలు సామాగ్రితోపాటు విలువైన సామాన్లు బుగ్గిపాలయ్యాయి. వెంటనే చుట్టుపక్కల వాళ్ళు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించినప్పటికీ ఇల్లు పూర్తిగా కాలిపోయింది. అర్ధరాత్రి కాకి నాగేశ్వరరావు ఆయన భార్య నిద్రిస్తూ ఉండగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వాళ్ళు చూసి కేకలు వేయడంతో లేచి చూడగా బయటికి రావడానికి దారి లేకుండా మంటలు వ్యాప్తి చెందడంతో పక్కింటి వారి ఇంటి గోడ దూకి తప్పించుకున్నారు. సుమారు రూ.10 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా. పల సంఘాలకు చెందిన పెద్దలు, యానాం బిజెపి ప్రెసిడెంట్ కనకాల రాజు, మాగాపు సుబ్బారావు తదితరుల నాగేశ్వరరావుని పరామర్శించారు.

ఆలయ కమిటీ సమక్షంలో ఇన్వర్టర్ ను ప్రారంభిస్తున్న బచ్చు సత్యనారాయణ

ఆలయానికి ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - యానాం

స్థానిక శివాలయం సమీపంలో కొలువై ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయానికి బచ్చు సత్యనారాయణ, గున్నరాజు దంపతులు సుమారు రూ.30 వేల విలువ గల ఇన్వర్టర్ ను బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలు చేతుల మీదగా ఇన్వర్టర్‌ను ప్రారంభించారు. అనంతరం సత్యనారాయణను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

సారా కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

మండలంలోని కృష్ణంపాలెం గ్రామానికి చెందిన సారా విక్రయదారుడు పాల అప్పారావును అరెస్టు చేసినట్లు దేవరపల్లి సెబ్ సిఐ డి.సుధ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో మంగళవారం రాత్రి కృష్ణంపాలెం గ్రామంలో దాడి చేసి అప్పారావును అదుపులోకి తీసుకోవడంతోపాటు, 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.సుదీర్, ఎన్. పుష్పగిరి బాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో నిరసన తెలుపుతున్న టిడిపి శ్రేణులు

వైసిపి ప్రభుత్వ వైఖరిపై నిరసన

ప్రజాశక్తి-ఆలమూరు

మాజీ సిఎం చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి నారా భువనేశ్వరిపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని కోరుతూ టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆయన పిలుపు మేరకు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆలమూరు బస్టాండ్ సెంటర్లో బుధవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళ్ళకు గంతలు కట్టుకొని వినూత్నమైన నిరసన తెలిపారు. అక్రమ కేసులు బనాయించి ఆధారాలు చూపకుండా వాయిదాలతో ప్రభుత్వం కాలం గడుపుతోందని వెంటనే న్యాయవ్యవస్థ చంద్రబాబుకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

పార్టీలకు అతీతంగా టిడిపి హయాంలో అభివృద్ధి

ప్రజాశక్తి-మండపేట

టిడిపి ప్రభుత్వం హయాంలో సంక్షేమం, అభివృద్ధి పార్టీలకు అతీతంగా జరిగిందని మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని జెడ్.మేడపాడు గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమం గ్రామ సర్పంచ్ కంచర్ల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ వడ్డీ రాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆయన పాల్గొని పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనకు ప్రజలు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం చంద్రబాబు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **అమలాపురం** అల్లవరం మండలం టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు దెందుకూరి సత్యనారాయణ రాజు అధ్యక్షతన అల్లవరం, బోడసకుర్రు, ఓడలరేవు, కొమరిగిరిపట్నంలో బుధవారం ఇంటింటికీ తిరిగి బాబుతో నేను కరపత్రాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా అమలాపురం మాజీ ఎంఎల్ఎ, అసెంబ్లీ ఇంచార్జ్ అయితాబత్తుల ఆనందరావు పాల్గొన్నారు. అనంతరం మండల పార్టీ ప్రెసిడెంట్, క్లస్టర్ ఇంచార్జ్ ల పర్యవేక్షణ సమావేశం జరిగినది. కార్యక్రమంలో సమన్వయ కమిటీ నాయకులు చింతా శ్రీనివాస్, కడలి వెంకటేశ్వరరావు, మండల సెక్రెటరీ కొపనాతి తాతాజీ, గ్రామ కమిటీ అధ్యక్షులు కొల్లు విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల బహూకరణ

ప్రజాశక్తి - గోకవరం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పుట్టిన రోజు సందర్భంగా మహా శక్తి కమిటి సభ్యులకు బుధవారం మాజీ జడ్‌పిటిసి పాలూరి బోసు బాబు ఆర్థిక సహాయంతో చీరలు పంపిణీ చేశారు. జ్యోతుల నెహ్రూ భార్య జ్యోతుల మణి చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు ఎస్‌విఎస్ అప్పలరాజు మాట్లాడుతూ మహిళ శక్తి కమిటీ సభ్యులు అందరూ భవిష్యత్తు గ్యారంటీ, మహిళా చైతన్య రథయాత్రలో ప్రతి ఇంటింటికి తిరిగి టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు వివరిస్తూ పంపిణీ చేశారని, మహిళా శక్తి కమిటీ మహిళలందరూ ఎంతో కష్టపడి బాబు గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి పని చేస్తున్నారని తెలిపారు. సిఎం జగన్ కక్ష సాధింపు చర్యలు మానుకుని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెడితే మంచిదని సలహా ఇచ్చారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును సిఎంను చేసేందుకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలినాటి ధర్మ నంద కుమారి, నెక్కిరెడ్డి సూర్యవతి, రాపాక లక్ష్మి, గొల్లవిల్లి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

స్కోప్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ

అత్యున్నత వైద్య ప్రమాణాలతో ప్రారంభించిన స్కోప్ ఆసుపత్రి వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జన్మభూమి పార్క్ సమీపంలో ఏర్పాటు చేసిన స్కోప్ హాస్పటల్‌ను మంత్రి విశ్వరూప్, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ తన చిరకాల మిత్రుడు డాక్టర్ సుధాకర్ కుటుంబ సభ్యులు మొత్తం వైద్య సేవలో నైపుణ్యత గల డాక్టర్లుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించి సమాజానికి తమ వంతు సాయం అందించే దిశగా ఈ ఆసుపత్రిని ప్రారంభించారన్నారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వైద్యులు ఉమ్మడి వైద్య సేవలు అందించడం ఈ ఆసుపత్రి ప్రత్యేకత అన్నారు. పేద ప్రజల విషయంలో లాభాపేక్ష లేకుండా సేవలు అందించడానికి డాక్టర్ సుధాకర్ ముందుకు రావడానికి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత సాయిబాబా, రాగిరెడ్డి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, తదితరులు

తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయో గ్యాస్

ప్రజాశక్తి-కాకినాడ

తడి చెత్త నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు ఆసక్తి కలిగిన సంస్థలు ముందుకు వస్తే ప్రభుత్వపరంగా తోడ్పాటు లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు చెప్పారు. కేంద్రప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణాభివద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు ఈ అంశంపై కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సంబంధిత ఏజన్సీలతో కమిషనర్ సమావేశమయ్యారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే సంస్థకు స్థలాన్ని సమకూర్చడంతోపాటు స్వచ్ఛభారత్ మిషన్ నుంచి ఆర్థిక తోడ్పాటు కూడా లభిస్తుందన్నారు. తడి చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా 2023-24లో దేశవ్యాప్తంగా సుమారు 500 ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ క్రమంలో ముందుకు వచ్చే సంస్థలకు అవసరమైన తడిచెత్తను నగరపాలక సంస్థ ద్వారా సమకూరుస్తామన్నారు. గో బర్ధన్ పేరిట జరిగే ఈ ప్లాంట్ ఏర్పాటులో పేడతోపాటు, ఎండిన ఆకులు, కూరగాయల, వ్యవసాయ వ్యర్థాలు, ఇతర తడిచెత్తను కార్పొరేషన్ నుంచి సమకూరుస్తామన్నారు. చమురు, సహజవాయువులను ఉత్పత్తి చేసే సంస్థల ప్రతినిధులతో ముందుకు వస్తే ప్రభుత్వంతో చర్చించి అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ మాధవీ, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో ఐసిసి సెంటర్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-కాకినాడ

స్మార్ట్‌సిటీ పర్యవేక్షణలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసిసిసి)ను త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు చెప్పారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన సెంటర్‌ను పునరుద్ధరించే అంశంపై బుధవారం తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.98 కోట్ల వ్యయంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌సెంటర్ నిర్వహణ చేసేందుకు మూడు ఏజన్సీలతో మాట్లాడామన్నారు. ఇందులో ఒక ఏజన్సీని ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బెంగుళూరు, పరిదాబాద్, గురుగామ్ వంటి స్మార్ట్‌సిటీలలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లను కూడా ఒక సంస్థ సమర్థవంతంగా నిర్వహిస్తోందని, ఇక్కడ కూడా ఆ సంస్థకు అప్పగించే అంశంపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. స్మార్ట్ సిటీ నిబంధనల మేరకు సంబంధిత సంస్థతో చర్చించాలని ఆయన అధికారులకు సూచించారు. సాధ్యమైనంతత్వరగా సెంటర్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్‌సిటీ ఎస్ఇ పి.వెంకట్రావు, కామేష్ పాల్గొన్నారు.

ఘనంగా లిటరసీ మాసోత్సవాలు

ప్రజాశక్తి-పిఠాపురం

వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న రామకృష్ణ

గ్లోబల్ మీడియా ఇన్ఫర్మేషన్ లిటరసీ మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల విద్యార్థులకు 'ఇండియా మీడియా లిటరసీ నెట్‌వర్క్' సహకారంతో ఫాక్ట్ శాల పేరిట కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు అధ్యక్షతన వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమలో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ ఆధారసహిత సమాచారం ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాణవాయువు వంటిదన్నారు. సామాజిక మాధ్యమాలలో వచ్చే సమాచారంలో వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇతరులకు పంపించరాదన్నారు. మానవ అభివృద్ధికి అక్షరాస్యత ఎంత ప్రాముఖ్యత వహిస్తుందో అంతకన్నా ఎక్కువ ప్రాముఖ్యత సమాచార అక్షరాస్యత వహిస్తుందన్నారు. ఫాక్ట్ శాల శిక్షకురాలు సత్య మలిరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా మనకు అందిన సమాచారం తప్పో ఒప్పో తెలుసుకోకుండా ఇతరులకు పంపించడం సరికాదన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న సమాచారం మూలాలను, దాని వెనుక ఉన్న వ్యక్తుల గురించి, అలాంటి వార్తలు షేర్ చేయడం వల్ల ఏర్పాడే పరిణామాలు ముందుగానే అంచనా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డివి.కాశీవిశ్వనాథం, కళాశాల లెక్చరర్లు సిహెచ్.శ్రీదేవి, జెబి.మాధవి, ఎం.సి.టి డైరెక్టర్లు ఎం.వి.ఆర్.ఫణీంద్ర, తోలేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై మాట్లాడే వారే లేరు

మాజీ ఎంపీ హర్ష కుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హర్షకుమార్

టిడిపి అధినేత చంద్రబాబుని జైల్లో పెట్టిన తర్వాత ప్రజా సమస్యలపై మాట్లాడేవాళ్లు ఎవరూ లేకుండా పోయారని మాజీ ఎంపి జివి.హర్ష కుమార్ అభిప్రాయపడ్డారు. నగరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుని జైల్లో పెట్టి రాష్ట్రాన్ని దోచుకోవాలని సిఎం జగన్ చూస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక, మట్టి, మద్యం మాఫియాలు రెచ్చిపోతున్నాయని ఆరోపించారు. సమస్య ఏదైనా ప్రతిసారి ప్రభుత్వాన్ని నేను నిలదీస్తూనే ఉన్నానని, సకల శాఖామంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి కోనసీమ భూములపై కన్నేశారన్నారు. భూముల కేటాయింపుపై కేసనపల్లి గ్రామస్తులు గ్రామసభలో వ్యతిరేకించారని తెలిపారు. ఒఎన్‌జిసి బావులను అభివృద్ధి చేయడానికి 6 వేల ఎకరాల భూములు కావాలట..ఇందుకోసం ఎవిఆర్ అనే సెల్ సంస్థను సూట్ కేస్ కంపెనీని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కంపెనీ సిఎం జగన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిదేనని ఆరోపించారు. ఈ కంపెనీలకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు పొందాల్సివుందని, .కానీ అటువంటి అనుమతులు లేవన్నారు. కులాలు, మతాలకు అతీతంగా అక్కడి ప్రజలు వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజల పొట్టను కొట్టి ఎవరికో బినామీకి కట్ట పెట్టాలని జగన్ రెడ్డి చూస్తున్నారని, భూములు స్వాధీనం చేసుకోవడాన్ని వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆదిరెడ్డి బెయిల్ రద్దుకు సుప్రీం నిరాకరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జగత్ జననీ చిట్‌ఫండ్ వ్యవహారంలో మాజీ ఎంఎల్‌సి, టిడిపి సీనియర్ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు బెయిల్ రద్దుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జగత్ జననీ చిట్‌ఫండ్ కంపెనీలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలతో ఆదిరెడ్డి అప్పారావు, రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవానీ భర్త, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి వాసును సిఐడి పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరికి ఎపి హైకోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే ఎపి హైకోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పును ఎపి సిఐడి సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ సందర్భంగా విచారణకు సహకరించాలని ఆదిరెడ్డి అప్పారావుకు సుప్రీంకోర్టు సూచించింది. విచారణకు సహకరిస్తారని ఆదిరెడ్డి అప్పారావు తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సుప్రీంకోర్టుకు తెలిపారు. దీంతో ఇరువురికి ఇచ్చిన బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సిఐడి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ రాజేశ్ బిందల్ ధర్మాసనం కొట్టివేసింది.

నమ్మకాన్ని వమ్ము చేయక పని చేస్తా

ప్రజాశక్తి - పెరవలి

రాష్ట్ర నాయకులను కలిసిన అరుణ కుమారి

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. నూతనంగా జిల్లా బాధ్యతలు అప్పగించిన ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజును, ప్రదేశ్ కమిటి కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీలను ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పార్టీ నాయకులను ఐక్యం పరిచి ముందుకు సాగుతానని తెలిపారు. ఆమె వెంట జిల్లాకు చెందిన వివిధ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుప్పలతో వాహనదారులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-మండపేట

రోడ్డు చెంతనే పెరిగిపోయిన తుప్పలు

మండపేట నుంచి వయా ఏడిద మీదుగా కడియం వెళ్లే ప్రధాన రహదారిలోని చింతాలమ్మ ఆలయం సమీపంలోని కల్వర్టుకు ఇవతల అవతల రోడ్డు చెంతనే తుప్పలు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుప్పలు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. తాపేశ్వరం ద్వారపూడి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో ఏడిద దుళ్ల ప్రధాన రహదారిలోనే ఆర్‌టిసి బస్సులు, లారీలు తదితర భారీ వాహనాలు వెళుతున్నాయి ఈ నేపథ్యంలో ఈ రహదారి మరింత రద్దీగా మారింది.

ప్రకటన

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 937/2022

Between:

దొంతంశెట్టి వెంకటేశ్వరరావు, S/o. పోతురాజు, హిందూ, వయస్సు 41 సం॥లు, R/o. దుళ్ళ గ్రామము, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం JCJC. **-వాది**

AND

అంద్రా వీరకృష్ణ, S/o. లోవరాజు, హిందు, వయస్సు 37 సం॥లు, వినాయక గుడి కాలనీ, దామిరెడ్డిపల్లి రోడ్డు, R/o. వీరవరం గ్రామము, కడియం మండలం, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం JCJC. **-ప్రతివాది**

పై నెంబరు దావాలో ప్రతివాదికి చాలా పర్యాయములు దావా సమన్లు పంపిననూ అందుకొనక Avoid చేయుచున్నారు. కాబట్టి **31-10-2023 సం॥ తేదీ ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, అడ్వకేటు ద్వారా గానీ హాజరై తన అభ్యంతరములు తెలుపుకోనిచో సదరు ప్రతివాదిపై Exparte ఉత్తర్వులు జారీ చేయబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

టి.విజయకుమార్
సిహెచ్.సామ్యూల్‌రాజు
వాది తరుపు న్యాయవాదులు
రాజమహేంద్రవరం మండపేట
తేది:17-10-2023 సెల్:9949135866

కల్తీ ఆహారంతో ప్రజారోగ్యానికి ముప్పు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కల్తీ ఆహార పదార్థాల వల్ల ప్రజారోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని, విద్యార్థి దశలో ఆహార పదార్థాల్లో కల్తీ ఏ విధంగా జరుగుతుందో అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ బి.శ్రీనివాస్ అన్నారు. పైడా కళాశాలలో డైరీ టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు విభాగాల్లో ఉత్తమ విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సూర్య ప్రకాష్, డిడి రవీందర్ రెడ్డి, అధ్యాపకులు భావన ఉపాధ్యాయులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 3వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం

O.S.No. 80/2023

Between:

Donthamsetti Umamaheswara Rao, S/o. Satyanarayana Murthy, Hindu, Aged 43 Years, Business, Veeravaram Village, Kadiyam Mandal, East Godavari District, R.J.C.J. ***...Plaintiff***

AND

Sunkari Nagaraju, S/o. Rama Naidu, Hindu, Aged 36 Years, Business, D.No. 1-230/1, High School Road, Veeravaram Village, Kadiyam Mandal, East Godavari District. ***...Defendant***

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **ది.27-11-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు దావాలో మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి, **కె.జగదీష్ కుమార్**
19-10-23. అడ్వకేట్, రాజమండ్రి.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు : రాజమహేంద్రవరం

I.A. 215/2021 in O.S. 34/2021

Between :

ఈగలపాటి లక్ష్మి ఐశ్వర్య ...పిటీషనర్ / ప్లయింటిఫ్

మరియు

ఈగలపాటి సీతారామలక్ష్మి, వగైరాలు ...రెస్పాండెంట్లు / డిఫెండెంట్లు

R_3 : వడ్లమూడి అచ్యుతదీప్తి,
W/o. నాగసీతారామ్, డో.నెం. 19-14-2, భుక్కావారి వీధి, మండపేట, మండపేట మండలం.

పై నెంబర్ దావాలో మిమ్ము 3వ ప్రతివాదిగా చేర్చవలసినదిగా పిటీషనర్ / వాది I.A. No. 215/2021ను దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టువారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పై నెంబరు పిటీషన్ **ది. 07-11-2023 సం॥** తేదీన వాయిదా అయ్యివున్నది. కావున పై తేదీన పైన తెలిపిన కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని ఎడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

IN THE COURT OF THE 6th ADDL. JUNIOR CIVIL JUDGE : KAKINADA

O.S. No. 1033 of 2022

Between :
CANARA BANK,
Nagamallithota, Kakinada
rep. by its Authorized Attorney ...Plaintiff

and

DURGAM SUJANA AND ANOTHER ...Defendants

To,
1) Durgam Sujana,
D/o. D.S.S. Sunder Singh, Age 29 Years, R/o. D.No. 63-6-20, G-4, Kavitha Apartments, Narasanna Nagar, Kakinada, Kakinada District, Kakinada Junior Civil Judges Courts Jurisdiction.
2) D.S.S. Sunder Singh,
S/o. D. Krupanandam, Age 55 Years, R/o. D.No. 65-13-3/2, Dwaraka Nagar, Kakinada, Kakinada District.

In the above matter the plaintiff filed this suit against you. The Hon'ble Court pleased to order notice to you for appearance either personally or through Advocate on **16-11-2023 at 10-30 am.** Otherwise the matter will be disposed off in your absence.

G.S.M.N. SWAMY, B.Com, B.L.
G.A.S.S. JYOTHI, B.L
ADVOCATES
KAKINADA. Cell: 9866191397

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

D.O.P. No. 359/2023

Between:
రాయుడు ఆదిలక్ష్మి ...పిటీషనరు

మరియు

రాయుడు శ్రీను ...రెస్పాండెంట్

To,
రాయుడు శ్రీను, S/o. నరసింహమూర్తి, డో.నెం. 3-17సి-26, 4వ వీధి, లక్ష్మీ హాస్పిటల్ ఎదురుగా, గొడారిగుంట, కాకినాడ, కాకినాడ జిల్లా.

ప్రకటన

పై నెంబరు కేసులో పై కోర్టులో మీ హాజరు నిమిత్తం చివరిసారిగా **ది. 14-11-2023 సం॥** తేదీనాటికి వాయిదా ఉన్నది. సదరు వాయిదా రోజున పై కోర్టులో **ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గానీ, మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గానీ కోర్టులో హాజరు అయ్యి మీ తరుపున ఆక్షేపణలు ఏమైనా ఉన్న యెడల శ్రీ కోర్టువారికి తెలియజేయవలెను. లేని యెడల సదరు తీర్పు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

రాచకొండ వెంకట సుబ్రహ్మణ్యం
పిటీషనరు తరపు న్యాయవాది
కాకినాడ. ది.18-10-2023 కాకినాడ. సెల్: 9848229704